Assemblies Of The Living Elohim (1. Tim 3:15) India presents............ సమస్తమును పరిశీలించి మేలైనది చేపట్టుడి

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper
**Postal Regd. No. H/APM/01/2009-2011**
Valid upto 12/2011
Posted on 30th of Every Month
**Annual Subscription Rs. 50/-**
To :

Editor & Publisher :
Bro. Isaac E. Kusuma
Malikipuram - 533 253
E.G. Dist. (A.P.) India.

Website : www.aotle-india.org
E-mail : satyamunakaiporatam@gmail.com
Office : Ph : 98493 85038

VOLUME : 13 TEBETH-SEBAT 5770 (JANUARY 2010) PAGES:4 ISSUE 143

**హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు**

## లోకాన్ని విడిచి వాక్యంలోనికి రండి

సర్వాధికారినందు గల ప్రియ యౌవనస్తులకు, విద్యార్థులకు, విద్యార్థినులకు, సహోదరీ సహోదరులకు అందరికీ ప్రత్యేకము ఈ వ్యాసము. నేటి విద్యార్థులపై లోకప్రభావము ఎంతవరకు ఉన్నది, ఆ ప్రభావము వలన జరుగు కీడు మేలుల విషయమై విద్యార్థులకు క్రైస్తవ యువతీ యువకులకు కొంత అవగాహన కలిగించి వారిని సత్యమైన మార్గములో ప్రోత్సాహకరంగా నడిపించాలనేది ఈ పత్రికయొక్క ముఖ్య ఉద్దేశ్యము. పరిశుద్ధ గ్రంథము ప్రతీ ఒక్కరికీ వ్యక్తిగతంగా బోధిస్తుంది. ఎవరి బాధ్యతలు వారికి నిర్దేశిస్తుంది. తండ్రికి తండ్రి బాధ్యతను, తల్లికి తల్లి బాధ్యతను, పిల్లలు తల్లిదండ్రులపట్ల లోబడి యుండుటను, యౌవనస్తులు నడవవలసిన త్రోవను అన్నింటిని పరిశుద్ధ గ్రంథము తెలియజేస్తుంది. మరి ముఖ్యముగా యౌవనులకు మార్గమును తెలియజేస్తుంది. పరిశుద్ధ గ్రంథములో అనేకమంది యౌవనులు మంచికి చెడుకి కూడా మాదిరిగా ఉన్నారు. తమ మనస్సును అదుపులో పెట్టుకోలేక అక్రమ మార్గంలో విచ్చలవిడిగా తిరిగిన వారి గతి ఏమైనదో మరియు యౌవన కాలములో మంచిగా పరమతండ్రికి నమ్మకంగా జీవించిన వారి పరిస్థితిని కూడా పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తుంది.

నేటి క్రైస్తవ యౌవనులను పరిశీలించగా లోకస్తులతో సహవాసం కలిగియున్నట్లు తెలుస్తుంది. లోకస్తులను మనం వాక్యంలోనికి మార్చడానికి ప్రయత్నం చేయాలి. నేటి లోక పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. రకరకాల మోడల్ దుస్తులు, అలంకరణకు అతి ప్రాముఖ్యత, బ్యూటీ టిప్స్, కృత్రిమ హంగులు, ఫ్యాషన్ టెక్నాలజీ, రంగురంగుల తలుకు బెలుకులతో, సరదాషికార్లతో, అనర్థపు నూతనత్వముతో లోకం ఎంతో వేగంగా పరుగులు తీస్తుంది. దీని వేగంతో అందరు కలిసిపోయి పరుగెడుచున్నారు. మరి ముఖ్యులైన క్రైస్తవ యౌవనులు. అందుకే మనకు వాక్యం హెచ్చరిస్తుంది. మనం చేస్తున్న ప్రతీ పని, ప్రతి కదలికను కనిపెట్టి మనలను మేల్కొల్పి పదే పదే ప్రబోధిస్తున్నది. **ప్రతీవాడును తాను చేయు పనిని పరీక్షించి చూచుకొనవలెను (గలతీ 6:4).**

విద్యార్థులపై సినిమా, టి.వి ల ప్రభావము: ప్రస్తుత కాలములో సినిమాలు టి.విలు లోకమును వాటిలో బంధించి వాటి చుట్టూ త్రిప్పుకొంటున్నాయి. వీటి బారిన పడనివారు ఎవరు కూడా లేరు. చంటిపిల్లలనుండి వృద్ధుల వరకు అందరు ఈ మీడియాకు ఖైదు చేయబడి ఉన్నారు. వీటి ప్రభావము అందరికంటె యౌవనస్తులపై ఎక్కువగా ఉంది. క్లాస్ రూమ్‌లో ఎలా అల్లరి చెయాలి, క్లాసులు ఎగ్గొట్టి సినిమాలకు ఎలా వెళ్ళాలి, తోటి విద్యార్థులను ఎలా ర్యాగింగ్ చెయ్యాలి, వస్త్రధారణ ఎలా ఉండాలి, ధూమపానం, మద్యపానం, విద్యార్థి దశనుండి ఎలా అలవాటు చేసుకోవాలి, ఆఖరికి విద్య నేర్పే టీచర్లను కూడా ఎగతాళి చేస్తున్నట్లుగా ఎంతో చక్కగా నేటి సినిమాలు నేర్పుతున్నాయి. విద్యార్థినులపై కూడా వీటి ప్రభావం ఎంతో బలంగా ఉంది. కాని కొంత అంతర్గతంగానే ఉందని చెప్పాలి.

సినిమాలను చూసి దానిలోని హీరోలను అనుకరించడం నేటి విద్యార్థులకు ఎంతో ఆసక్తిగా ఉంది. అవే డైలాగులను ఉచ్చరిస్తూ వారివలె ప్రవర్తించుటకు, వారివలె వస్త్రములను అలంకరించుకొనుటకు, వారివలెనే కనిపించుటకు ప్రయత్నం చేస్తున్నారు. సినిమా హీరోలు మనకు మాదిరి కాదు, మార్గదర్శకులు కారు. వారు ధనమును సంపాదించుకొనుటకు కేవలం నటించువారు మాత్రమే. వారిని ఆదర్శంగా తీసుకొనవలసిన అవసరం ఏమియును లేదు లేనేలేదు. విద్యార్థినులు హీరోయిన్స్‌ను అనుకరించుటకు ప్రయత్నం చేస్తుంటారు. వారిని అభిమానించవలసినంత అవసరం లేదు. వాళ్ళు డబ్బుకోసం ఎవరితోనైనా, ఎలాగైనా నటిస్తారు. ఒకే హీరోయిన్ పదిమంది హీరోలకు ప్రేయసిగా ఉంటుంది. తనను అభిమానించే మనం ఆమెలా ఉండలేము కదా! వాస్తవం వేరు సినిమా వేరు తెరమీద వారి ప్రవర్తన వేరు తెరవెనుక వారి నిజజీవితం వేరు అందువలన మనం వారిని ఆదర్శవంతులు అని అపోహపడకూడదు. మనం ఆదర్శంగా తీసుకోవలసిన హీరోలు వేరుగా ఉన్నారు. వారు నిజమైన హీరోలు ముఖానికి రంగుపూసుకొని కెమేరాముందు నటించేవాళ్ళు కారు. నిజమైన యోధులు వాళ్ళు. ఆ యోధులు ఎవరో పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తుంది.

1. **అబ్రహాము:** నిరీక్షణ, త్యాగంలో ఈయనను మించిన హీరో ఎవరున్నారు? నిరీక్షణ లోను, త్యాగంలోను అబ్రహాము మనకు మాదిరి, ఆదర్శం..........................ఆది 15:6
2. **ఇస్సాకు :** విధేయతలో ఇస్సాకు మనకు ఆదర్శం తండ్రికి లోబడిన వానిగా ప్రాణం పోతున్నా ఎదురు చెప్పనివాడు, తండ్రి మాటకు తల ఒగ్గినవాడు..................ఆది 22:7
3. **యాకోబు:** పోరాడుటలో మనకు మాదిరి.................................ఆది 32:28
4. **యోసేపు:** నిగ్రహంలో మనకు మాదిరి. ...............................ఆది 39:8-10
5. **మోషే:** భూమిమీద నున్న వారికందరికి మిక్కిలి సాత్వికంలో మాదిరి... సంఖ్యా 12:3
6. **కాలేబు, యహోషువ:** పూర్ణమనస్సుతో, ప్రత్యేక ఆత్మతోను పరమతండ్రిని అనుసరించుటలో వీళ్ళు మనకు మాదిరి.............................................. సంఖ్యా32:11,ద్వితీ 1:36,37
7. **ఫీనెహాసు:** కళ్లెదుట జరుగుచున్న చెడును అరికట్టుటలో మనకు మాదిరి.... సంఖ్యా 25:6-13
8. **యెఫ్తా:** పరమతండ్రికి ఇచ్చిన మాటను నెరవేర్చుట విషయములో తెగించుటకై మనకు మాదిరి. .....................................................న్యాయాధి 11:35
9. **బోయజు:** కృంగినవారిని, నలిగిపోయియున్నవారిని ఆదరించుటలో మనకు మాదిరి..... రూతు 3:7-17
10. **సమూయేలు:** న్యాయము కలిగి, నీతిగలిగి పసితనమునుండి పరమతండ్రిని సేవించి, పరిచర్య చేయుట విషయములో మనకు మాదిరి................................1సమూ 12:1-4
11. **ఎలీషా:** అవిధేయతతో ఇచ్చు విస్తారకానుకలను తుచ్ఛమైనవని ఎంచి నిరాకరించుటలో మనకు మాదిరి. .....................................................2రాజులు 5:15,16
12. **ఏలియా:** పరమతండ్రియొక్క శక్తిని అన్యులకు బయలు భక్తులకు చూపించుటలో మనకు మాదిరి. ..................................................... 1రాజులు 18:1-40
13. **నెహెమ్యా:** పరిశుద్ధ పట్టణము, పరమతండ్రి మందిరము విషయములో మహాగొప్ప ఆసక్తిని చూపుటలో మనకు మాదిరి. (పితరులపాపమును ఒప్పుకొని ప్రార్థించుటలో) .....నెహెమ్యా 1:3; 2:1-8
14. **దావీదు:** మేధస్సుతో గెలుచుటలో మనకు మాదిరి.......................1సమూ 17:46-49
15. **యోబు:** నీతి, దీనత్వములో, సహనంలో, శోధనలో, చెడుతనమును విసర్జించుటలో మనకు మాదిరి. .....................................................యోబు 1:8
16. **సొలొమోను:** జ్ఞానములో సొలొమోను కంటె ఎవరు గొప్పవారు కారు. సొలొమోను మనకు జ్ఞానంలోనే ఆదర్శం.....................................................1రాజులు 3:10-12
17. **మీకాయా:** ఒంటరివాడైయున్నను పరమతండ్రి చెప్పిన దానిని నిర్భయంగా తెలుపుట విషయములో మనకు మాదిరి.....................................................1రాజులు 22:4-24
18. **యెషయా:** పరమతండ్రి కొరకు కనిపెట్టుచు, సూచనలు, మహాత్కార్యముల విషయములో మనకు మాదిరి. .....................................................యెషయా 8:18
19. **యిర్మీయా:** అవమానమును, అపహాస్యమును భరించి తండ్రినామమును ప్రకటించుటలో మనకు మాదిరి. .....................................................యిర్మీయా 20:7-9
20. **యెహెజ్కేలు:** తిరుగుబాటు దారులకు సహనముతోను, ఓర్పుతోను తండ్రివాక్యమును ప్రకటించుటలో మనకు మాదిరి..................................................... యెహెజ్కేలు 2:1-7
21. **దానియేలు:** పరమతండ్రికి ప్రార్థిస్తే ప్రాణాలు పోతాయి అని తెలిసినా విడువక ప్రార్థించి తండ్రియొక్క కాపుదలను పొందుటలో మనకు మాదిరి...................... దానియేలు 6:10-24
22. **షద్రక్, మేషాక్, అబేద్నెగోలు :** ధైర్యం, తెగింపు, సత్యముకొరకై త్యాగం మాదిరి వీళ్ళు. ..................................................... దానియేలు 3:12-30
23. **హబక్కూకు:** ఏమి ఉన్న ఏమి లేకపోయిన తండ్రియందు సంతోషించుటలో మనకు మాదిరి. .....................................................హబక్కూకు 3:17,18
24. **అపోస్తలులు:** కష్టమైన నష్టమైన, హింసయైన శ్రమయైన,ఆత్మతో సత్యంలో నడుచుటలో అపోస్తలులు మనకు మాదిరి.

అలాగే యౌవన సహోదరీలకు మేలుకలుగుటకై తండ్రి గ్రంథమందున్న వారిని పోలి మాదిరిగా యుంచుకొని జీవితాలలో మంచి ఫలాలను పొందుకొనుడి.

1. **శారా:** యోగ్యురాలై తన భర్తకు లోబడియుండుటలో మాదిరి...............1పేతురు 3:1-6
2. **రిబ్కా:** ఓర్పుగలిగి సహాయగుణం కలిగి పరిచర్య చేయుటలో మాదిరి.......ఆది 24:15-20
3. **షిఫ్రా,పూయ:** పరమతండ్రి మాట విని రాజాజ్ఞను కాదని కీడుచేయక మేలు చేయుటలో మాదిరి. .....................................................నిర్గమ 1:15-21
4. **సిప్పోరా:** ప్రాణాపాయ సమయములో ఎంతో వివేకముతో తన భర్తను రక్షించుటకు జ్ఞానము గలిగి తండ్రి నిబంధనలో తన కుమారుని నిలుపుటలో మాదిరి...................నిర్గమ 4:24,25,
5. **రాహాబు:** తండ్రిపంపినవారిని చేర్చుకొని సాహసం చేసి ఉపకారం పొందుటలో మాదిరి (వేశ్యపనిచేయడంలోకాదు) ....................................యహోషువ 2:1-19
6. **యెఫ్తాకుమార్తె:** తన తండ్రిమ్రొక్కుకొనినందున తన ప్రాణము పరమతండ్రికి అర్పించుటకు వెనుదిరుగక తన తండ్రి ధైర్యపరచు గొప్ప త్యాగం చేయుటలో మాదిరి. .............న్యాయాధి 11:36
7. **రూతు:** ప్రేమించే భర్తనే కాదని వెళ్ళిపోతున్నవారికి భర్తలేకపోయినను తన అత్తను వెంబడించి అణకువరాలై మంచి కుటుంబస్తురాలుగా మారుటలో మాదిరి. రూతు 1:16
8. **హన్నా:** తన ఆత్మను పరమతండ్రి సన్నిధిలో కుమ్మరించుకొని పరమతండ్రి కృపవలన కుమారునిని పొంది అతని బాల్యమందే పరమతండ్రి సేవకు అర్పించుటలో మాదిరి. 1సమూ 1:10-28
9. **దెబోరా:** న్యాయ అన్యాయములను, ఏది నిజమో ఏది అబద్ధమో గ్రహించి వివేకముతో న్యాయవిమర్శచేయుటలో మాదిరి. న్యాయాధి 4:45
10. **యాయేలు:** దుష్టుని అంతమొందించవలసిన పరిస్థితి వచ్చినప్పుడు ధైర్యముగలిగి జయమునిచ్చుటకు తెగువ చూపుటలో మాదిరి. న్యాయాధి 4:21
11. **ఎస్తేరు:** తన ప్రజలపైన జరుగుచున్న కుట్రనుండి విడుదల పొందుటకు రాజమందిరంలో ప్రవేశించుట న్యాయవ్యతిరేకమైనను తెగించి తన వారిని కాపాడుకొనుటలో మాదిరి ఎస్తేరు 4:16
12. **అబీగయీలు:** మోటువాడును, దుర్మార్గుడునైన తన భర్తను బ్రతికించుకోడానికి తన ఓర్పు సహనముతో మాట్లాడిన విధానము ప్రవర్తన మాదిరి. 1సమూ 25:24-32
13. **ఎలీసబెతు:** సకలమైన ఆజ్ఞలు విషయములో నిరపరాధిగా నీతిమంతురాలిగా మాదిరి లూకా 1:6
14. **అన్న:-** రేయింబగళ్లు ఉపవాసప్రార్థనలతో మందిరమును విడువక సేవించుట విషయంలో మాదిరి. లూకా 2:36,37
15. **కనానుస్త్రీ:** ఎంతోవిశ్వాసము గలిగి కుమార్తె స్వస్థత విషయములో బ్రతిమాలి గెలుచుటలో మాదిరి. మత్తయి 15:21-28
16. **బీద విధవరాలు:** తండ్రి సమర్పించుటలో లేమిలోనున్న కలిగిన జీవమును ఇచ్చుటకు మాదిరి. లూకా 21:1-4
17. **అత్తరుపూసిన స్త్రీ:** వెలగల అత్తరును తండ్రి భూస్థాపన నిమిత్తము శరీరమును అభిషేకించి ప్రశంసపొందుకొనుటలో మాదిరి. మార్కు 14:3-9
18. **లూదియ:** లక్ష్యముగలిగి వాక్యమును వినుచు భక్తికలిగి యుండుటలో మాదిరి. అ॥కార్య 16:14,15
19. **ప్రిస్కిల్ల:** సేవాపరిచర్యలో అనుక్షణం సహకరించి విడువకుండుటలో మాదిరి అ॥కార్య 18:1,26
20. **పెర్సిసు:** సర్వాధికారినందు బహుగా ప్రయాసపడుటలో మాదిరి రోమా 16:11
21. **సహకారులైన స్త్రీలు:** ప్రయాసముతో సువార్తపనిలో సహకరించి జీవగ్రంథమందు పేర్లు వ్రాయబడియుండుటకు మాదిరి. ఫిలిప్పీ 4:3
22. **లోయి,యునీకె:** నిష్కపటమైన విశ్వాసమును నిర్మలమైన మనస్సాక్షితో సేవించుటలో మాదిరి. 1తిమోతి 1:5

శారా, దెబోరా, మరియ: వీళ్ళు యౌవన స్త్రీలకు, కన్యకలకు, ఫిలిప్పు కుమార్తెలు మాదిరి మరియు పరిశుద్ధ గ్రంథమందున్న వీరులను మనం ఆదర్శంగా తీసుకొని మనం ముందుకు సాగాలి గాని, నీతికొరకు న్యాయము కొరకు, సత్యం కొరకు ఆలోచించని లోకస్తులను వెంబడించాలనే కోరికను వీడి మనం యదార్థ గ్రంథమునందున్న వారిని మనం ఆదర్శంగా తీసుకున్నప్పుడే మనకు మేలు జరుగుతుంది. కాని మనం అసత్యమైన వాటిని వెంబడించుట మానివేయాలి. సినిమాలు అన్ని అసత్యమని, దానిలోనివి అన్ని కల్పితములని తెలిసినా వాటినే మనవాళ్ళు నిజములనుకొని ఎంతో తీవ్రంగా స్పందిస్తారు. వాటిలోని పాత్రదారులు ఏడుస్తుంటే, ఏడుస్తారు. నవ్విస్తుంటే నవ్వుతారు ఉద్రేకపడుతుంటే ఉద్రేకపడతారు. తెరమీద జరుగుచున్నది యదార్థంగా జరగడంలేదని తెలిసినా యదార్థాలకంటే ఎక్కువగా వాటినే గుర్తించి మరచిపోకుండా పదే పదే చెప్పుకొంటూ ఉంటారు. సినిమాలలో చూపించే రంగు రంగుల డిస్కోలకు మనవాళ్ళు ఆకర్షితులై జాలీలైఫ్‌కు మెగ్గుచూపుతున్నారు. అవి అన్ని కేవలం నీడవంటివి అవి అన్ని కీడుకు కారణములే గాని మంచికి, నెమ్మదికి మార్గములు కావు. ఇవి అన్ని పరిశుద్ధ మార్గానికి విరోధమైనవి, వీటన్నిటినీ మనం గుర్తించి వాటి మత్తులో ఉన్నవారిని అందరిని మేల్కొల్పి మంచిమార్గంలో నడిపించాలి గాని లోకంలో అందరివలె వాళ్ళతో కలసిపోయి లోకస్తులవలె ఉండకూడదు. ముందుగా మనం ఎవరి వారమో గుర్తెరిగి మనలను మనం భద్రం చేసుకోవాలి.

తెరమీత కదలికలకు అవివేక ప్రదర్శనలకు, ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నామో, పరిశుద్ధ వాక్యానికి, ప్రార్ధనలకు ఆత్మీయ జీవితానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నామో ప్రతీ ఒక్కరు గ్రహించాలి. మన వాళ్ళు టి.వి చూసినంతసేపు

వాక్యం చదువలేరు. టి.వి కి ఇచ్చినంత ప్రాముఖ్యత ప్రార్థనకు ఇవ్వలేరు. ఒకానొక దినం వస్తుంది. ఆదినమందు ఈ రంగు రంగుల సినిమాలు, టి.విలు ఆహ్లాద ప్రపంచ నటనలు ఉండవు ఇవి శాశ్వతమైనవి కావు. పరలోక రాజ్యమార్గానికి సహకారులు కావు. ఇవి అన్ని ఆత్మీయ జీవితమును చంపివేసి అక్రమ మార్గంలో యువతను నడిపించు సాధనములైయున్నవి. గమనించండి సహోదరులారా, మనం వాక్యం ద్వారా లోకాన్ని, దాని చెడ్డ క్రియలను సరిచేయవలసిన వారము ఇప్పటికీ మన క్రైస్తవ యువతపైన చాలా అపోహలు ఉన్నవి. అల్లరి చిల్లరగ తిరిగే వారని, ధూమపానం మద్యపానం చేసి వీధులలో కేకలువేసి తూలుతూ నడిచే వర్గమువారనీ, ఏ విధమయిన నిగ్రహము (కంట్రోల్) లేనివారని విచ్చలవిడిగా తిరిగే వారని, తల్లిదండ్రులకు లోబడని వారని, గొడవలకు, కొట్లాటలకు అల్లర్లకు ముందుకు వెళ్ళేవారని ఇంకా ఎన్నో అపోహలు ఉన్నవి. వీటిలో చాలావరకు కూడా నిజాలు కావచ్చు. గనుక వీటిని అన్నింటిని మనం జయించి మంచి పౌరులుగా నిజమైన విశ్వాస సంబంధులుగా అనేక మందికి మాదిరిగా జీవించాలి దానికి ఏకైక మార్గం పరిశుద్ధ గ్రంథము ఒక్కటే గనుక మనం పరిశుద్ధ మార్గంలో ప్రయాణం చేద్దాం. కంటికి కనిపించే అందచందాలను ఆశించి పరమతండ్రికి దూరం అవుచున్నవారికి వాక్యం వివరిస్తుంది. **అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము** సామెతలు 31:30 ఈ మోసకరమైన పైపై అందమును చూచి పరుగుపెడితే వ్యర్థముగా మోసపోవలసివస్తుందని వాక్యం తెలియజేస్తుంది. సినిమా వాళ్ళ అందమునంతా డబ్బుగా మార్చుకుంటారు. వాళ్ళ అందముతో వారిని వారే వ్యర్థంగా మోసము చేసుకుంటున్నారు. ఈ నటనకు ఆకర్షితులై అనేకమంది యువతులు వారి జీవితాలను కోల్పోయినారు, కోల్పోతున్నారు. అది ఒక పాపకూపము వంటిది. నేటి సినిమా వ్యవస్థ యువతపై చాలా ప్రభావము చూపుతుంది. male, female చాలా వేగంగా, చాలా సులభంగా చాలా గాఢంగా ఆకర్షితులగునట్లుగా male, female మధ్య సంబంధాన్ని హృదయంలో నాటుకుపోయేటంత దారుణంగా వారి మధ్య స్పర్శను ఎక్స్‌పోజ్ చేస్తున్నది. వాటిని చూసి నేటి యౌవనస్థులు మరింత దూకుడుతనంగా ఉన్నారు. దినదినము, క్షణక్షణము, వస్త్రధారణ, కేశాలంకరణ వెంట వెంటనే మారిపోతున్నాయి. అవి సంస్కారవంతముగా ఉంటే చాలా సంతోషము కాని అవి ఆ విధంగా ఉండటంలేదు. ఇంకా చాలా విషయములు ఉన్నవి. వాటిని సరిచేసుకోవలసిన బాధ్యత తరువాత సరిచేయవలసిన బాధ్యత మనపై ఉన్నది. **మనుష్యులు పై స్వరూపమును లక్ష్యపెట్టుదురు గాని, యావె హృదయమును లక్ష్యపెట్టును.** 1సమూ 16:7.

మనం అందరికీ మార్గదర్శకులవలె జీవించాలి. నిజంగా మనం మార్గదర్శకులమే. అన్యులకు లోకస్తులకు అందరికి ఎందువలన అనగా మనం నిజమైన సర్వసృష్టికర్తను, నిజమైన రక్షకునిని ఆరాధిస్తున్నాము. ఏ లోపము ఏ బలహీనతలేని వానిని ఆరాధించుమనము ఆయన కుమారులము గనుక ఆయన నామమునకు అపకీర్తి కలుగకుండా, ఏ లోపము లేకుండా, ఏ బలహీనత లేకుండా మంచి నీతిగల పరిశుద్ధునియొక్క కుమార్తెలుగా, కుమారులుగా జీవించాలి గాని అన్యులకంటె బలహీనులుగా character విషయంలోగాని, నీతివిషయంలోగాని యౌవనకాలంలో బలహీనంగా తొట్రిల్లిపోవడం గాని ఉండకుండా బహుధైర్యంగా జీవించాలి. అందుకే మనకొరకు వాక్యం వ్రాయబడి యున్నది.

**యౌవనులు దేనిచేత తమ నడత శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమునుబట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా?** కీర్తనలు 119:9 ఆయన మనలను ముడత, మచ్చలు లేని వారిగా మంచి నడవడికను కలిగిన యౌవనబిడ్డలుగా చూడాలనీ ఆశపడుచున్నారు. ఒకరిచే చెప్పించుకునే పిల్లలుగా మన నడవడిక ఉండకూడదు. ఈ విషయంలో చాలా జాగ్రత్త వహించాలి. వివాహము కాకుండా చాలా మంది యౌవనులలో జరగకూడని పొరపాట్లు చాలా జరిగిపోతున్నాయి. యౌవన సహోదరీ! అటువంటి వాటికి చోటివ్వకండి. అవి చాలా ప్రమాదకరం. అదిఅన్ని రకములుగా మోసమే. తల్లిదండ్రులను మోసం చేసినట్లే అన్నిటికంటె పరమతండ్రికి బహు విరోధము, పాపము. దీనికి బహు భయంకరమైన శిక్ష గమనించండి. ఇటువంటి దుష్క్రియ మనంలో జరుగకుండా అందరిని హెచ్చరించండి. చెడు మన మధ్యలో ఉండకూడదు. చెడు సాతాను సంబంధి. సాతానును దూరంగా తరుమండి. 1కొరింథీ 6:12 సహవాసము విషయములో కూడా జాగ్రత్త వహించండి. దుష్ట సాంగత్యము మంచినడతను చెరుపును. కొందరు సాధారణ సలహాలు ఇస్తారు. వారిని గూర్చి జాగ్రత్తపడాలి. ఈ యౌవనంలో ఇవి అన్నీ సర్వసాధారణం అని తేలికగా దారితప్పించి సాతాను చెంతకు చేరుస్తారు. ఇటువంటివి చాలా ప్రమాదకరం యౌవన కాలమును గూర్చి ప్రతీ వానిని ఆయన తీర్పుదినమందు తప్పక ప్రశ్నిస్తారు. కాళ్ళకు అడ్డులేకుండా తిరుగు ప్రతీవానిని అడుగుతారు. అటువంటివారి కొరకు హెచ్చరిక వాక్యం వ్రాయబడి యున్నది. **"యౌవనుడా, నీ యౌవన మందు సంతోషపడుము, నీ యౌవన కాలమునందు నీ హృదయమును సంతుష్టిగా ఉండనిమ్ము, నీ కోరిక చొప్పునను నీ దృష్టియొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటిని బట్టి ఎలోహీం నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపకముంచుకొనుము."** ప్రసంగి 11:9 యౌవన కాలపు ప్రవర్తనను బట్టి అందరికి తీర్పు ఉంటుందని తెలుసుకొని చెడు సహవాసము చేయక మంచి మార్గంలో ప్రయాణించి, ప్రయాణింపచేద్దాం. కంటికి యుక్తమైనదంతయు మనము చేయక రక్షకుడు యషువ మెస్సీయకు భయపడు వారముగా జీవించుదాం. **"యౌవన కాలమున కాడి మోయుట నరునికి మేలు"** విలాపవాక్యములు 3:27 మేలు పొందుటకు నిజమైన రక్షకుని కొరకు సాక్ష్యమును కాడిని మోయువారముగా బలహీనులకు బలము ఇచ్చు రక్షణ సువార్తను చెప్పువారముగా ఉండాలి.మనము ప్రత్యేకింపబడినవారం. మనం అందరిలాంటి వారము కాము. మనము ఈ లోకపువారము కాము. మన ప్రయాస ప్రయాణము ఈ లోక సంబంధమైనది కాదు, మనము ఈ లోకమును జయించువారము. మంచి యోధులుగా మెస్సీయ కొరకు పోరాడువారము. ఈ లోకసంబంధము కొరకు, ప్రేమల కొరకై తల్లిదండ్రులపై పోరాటం చేసి ఇంటిలోనుండి బయటకు వెళ్ళిపోయి అన్యదేవతల గుడిలో వివాహము చేసికొని తల్లిదండ్రులకు దూరంగా జీవించుటకై చేసే పోరాటము వంటి పోరాటము వంటిది కాదు. కాలేజీ వీవితంలో ఫీజులకొరకు, ధర్నాలు, స్ట్రైక్‌లు, రాస్తారోకోలు, వంటి పోరాటములు కావు. ఇవి అన్నీ సినిమాలు నేర్పే పోరాటములు. మనం ఈలోక సంబంధులం కాదు. మన పౌరస్థితి పరలోకమందున్నది. గనుక మన పోరాటం వేరు (ఫిలిప్పీ 3:20) దురాత్మతో మనం పోరాడుచున్నాము (ఎఫెస్సీ 6:12) ఈ దురాత్మ పరమతండ్రి నుండి వేరుచేసి ఈలోక ఆనందములవెంట, ఈ లోక సంబ్రములవెంట నడిపిస్తుంది. అందుకే మనలో కొందరు వారికి తెలియకుండానే ఎందుకు వెళ్తున్నారో వారికే తెలియక అన్యులు జరుపుకొనే తీర్థములకు, తిరునాళ్ళకు, రాత్రి స్టేజిషోలకు వెళ్తుంటారు. ఇవి అన్ని వ్యర్థము. మన ప్రయత్నం వేరు.మన ఆశయం వేరు. ప్రతీవారికీ మన రక్షకుని గూర్చి తెలియజేసి మంచిమార్గంలో అందరిని నడిపించాలి. అన్యాయము, అక్రమము, అసత్యము లేకుండా పరలోకపు నీతి రాజ్యమార్గంలో అనేకులను చేర్చు ప్రయాసము మనది కాని ఈ తుచ్ఛమైన రంగు రంగుల వేషగాళ్ళను అనుకరించుటకాదు. వాళ్ళు మనవంటివారే వారిలో ఏ గొప్పతనము లేదు అందరికంటె గొప్పవారు మన తండ్రి యావె ఆయన నిత్యము ఉండువారు నిరంతరము ఏకరీతిగా ఉండువాడు. ఈ లోకంలో మనం అందరం కేవలం గడ్డి వంటివారము. **"సర్వశరీరులు గడ్డిని పోలినవారు, వారి అందమంతయు గడ్డి పువ్వు వలె ఉన్నది. గడ్డి ఎండును దాని పువ్వుఉను రాలును. అయితే సర్వాధికారి వాక్యము ఎల్లప్పుడును నిలుచును."** 1 పేతురు 1:24 ఎప్పుడు ఎలా మరణిస్తారో తెలియని మానవున్ని ఆరాధించక మనకై మన పాపములకొరకై ప్రపంచమానవాళి పాపముల కొరకై తన రక్తము నిచ్చి రక్షణ నొసగిన పరమతండ్రి యషువ మెస్సీయను అభిమానించండి. ఆరాధించండి కాని మనవంటిమానవులను ఆవిరి వంటి ఆటగాళ్ళను, పాటగాళ్ళను వద్దు, **రేపేమి సంభవించునో మీకు తెలియదు మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే.** యాకోబు 4:14. ఎంతోమంది నటులు వస్తూఉంటారు, పోతూఉంటారు. కాని వారికి రక్షణ మార్గంగాని వాక్యసత్యం గాని తెలియదు వాళ్ళు అందరు బయలు భక్తులు, దేవతారాధకులు, మన పరమతండ్రి భక్తిమార్గమునందు ఆసక్తిలేనివారు. వారిని అభిమానించుట, ఆరాధించుట ఎంత అవసరమో గ్రహించండి. సినిమాలు అన్ని మనవాళ్ళ వల్లే లాభం పొందుచున్నాయేమో అనే అంతగా ఉంది పరిస్థితి మన క్రైస్తవ విశ్వాసులు లేకపోతే సినిమాలు నడవవేమో అనిపిస్తుంది. ఇవి అన్ని మనిషి పెట్టినవి ఇవి నిలిచేవికావు నరుడు నిలువనప్పుడు నరుడు స్థాపించినవి నిలుచునా?

**నరులు వట్టి ఊపిరిని పోలియున్నారు. వారి దినములు దాటిపోవు నీడవలెనున్నవి.** కీర్తనలు 144:4 మన జీవితకాలం ఎంతో మనం ఎపుడు మరణిస్తామో మనకు తెలియదు. జీవమున్నంతకాలము మంచిగా పరమతండ్రికి తల్లిదండ్రులకు అందరికి చక్కటి పేరును తెచ్చుబిడ్డలుగా, మంచి విద్యార్థులుగా జీవిద్దాం, మన క్రైస్తవ సమాజములలో జరుగుచున్న అక్రమములను, రహస్య కార్యములను, చెడు ప్రవర్తనలను పరమతండ్రికి వ్యతిరేకంగా జరుగుచున్న చాలా కార్యములను వాక్యము ద్వారా, ప్రార్థనలద్వారా, సత్యము ద్వారా జయిద్దాం, తండ్రి కార్యంలో మనం సహకరిద్దాం. ఈలోక అపవిత్రతకు, అక్రమ బంధాలకు, సాతానుకు దూరంగా ఉండి అందరికంటె నీతిగా తండ్రి రాజ్యంలో మంచి స్థానమును పొందుదాం.

అక్రమాన్ని క్రమపరచేవారము మనమే కనుక మనము అక్రమములో ఉండకూడదు. సత్యాన్ని చెప్పే మనం అసత్యంలో ఉండకూడదు నూతన విశ్వాసంతో నూతన విధానంతో మనం లోకమును మన స్థితిగతులను మార్పుచేసుకుందాం. మనం వాక్య సంబంధులమని మంచి నడవడికలు గల వారమని నిరూపించుకుందాం. ప్రార్థన జీవితంను పున:రుద్ధరించుకొని ఆత్మ సంబంధులుగా జీవిద్దాం.

**"ఎవడైనను మెస్సీయ ఆత్మలేనివాడైతే వాడాయనవాడుకాడు"** రోమా 8:9 గనుక ఆత్మ గలవారిగా ఆయనవారిగా జీవిద్దాం. **"ఎలోహీం ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు ఎలోహీం కుమారులైయుందురు."** గలతీ 8:14. అందువలన మనం ఆయన కుమారులుగా, కుమార్తెలుగా జీవిద్దాం. అసత్యమునకు, అపవిత్రతకు చోటు లేకుండా వాక్యంలో, ప్రార్థనలో దినదినం అభివృద్ధిచెందుతూ లోకవేషధరణకు, రంగు రంగుల సొగసులకు, శారీరక ఉప్పొంగులకు దూరంగా ఎంతో నమ్రతగా, అనకువగా, పదిమంది గౌరవించు విధానముగా వస్త్రాధారణను, అలంకారమును మార్చుకొని పరమతండ్రిని నమ్మిన యౌవనస్తులుగా అందరికి మాదిరికరంగా జీవితమును సాగిద్దాం. పరమతండ్రియావె మిమ్ములను రక్షించి కాపాడును గాక!!

– బ్రదర్. సి.హెచ్. చంద్రశేఖర్

# తిరుగుబాటుదారులకు సువార్త

– బ్రదర్. ఐజక్ ఇ. కుసుమ

ఇశ్రాయేలీయుల ఎలోహీం అయిన యావె యెహెజ్కేలుని తిరుగుబాటుదారులైన ఇశ్రాయేలీయులకు సువార్త/ వర్తమానం అందించడానికి పిలిచాడు. వారు ఆయన మాటలే వినరని ఈయన మాటలు అంతకన్నా వినరని తెలుపుతూనే వారి యొద్దకు యెహెజ్కేలుని పంపిస్తున్నాడు. యెహెజ్కేలు 2:3-4, 3:4-11

యావె – ఈ తరమువారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటివారును ఓడలో ప్రవేశించుడి (ఆది 7:1) అను నోవహుతో ఎలోహీం చెపుతూనే నోవాహు ద్వారా మూర్ఖ జనాంగానికి సువార్త ప్రకటింపజేసాడు. వారంతా సువార్త విని వస్తారని మాత్రం కాదు.

అప్పుడాయన –నీవు త్వరపడి యరూషలేము విడిచి శీఘ్రముగా వెళ్ళుము. నన్ను గూర్చి నీవిచ్చు సాక్ష్యము వారంగీకరింపరని నాతో చెప్పెను. అ॥కార్య 22:18.

నీవు ఈ మాటలన్నియు వారితో చెప్పినను వారు నీ మాటలంగీకరింపరు. నీవు వారిని పిలిచినను వారు నీకుత్తరమియ్యరు గనుక నీవు వారితో ఈలాగు చెప్పుము. యిర్మీయా 7:27,28.

ఇదిగో తిరస్కరించువారలారా! ఆశ్చర్యపడకుడి నశించుడి మీ దినములలో నేనొక కార్యము చేసెదను ఆ కార్యము ఒకడు మీకు వివరించినను మీరెంతమాత్రమును నమ్మరు అనెను. అ॥కార్య 13:41.

అందుకాయన – నేను మీతో చెప్పినయెడల మీరు నమ్మరు అదియుగాక నేను మిమ్మును అడిగిన యెడల మీరు నాకు ఉత్తరము చెప్పరు. లూకా 22:67,68.

వాని మూఢత చొప్పున మూర్ఖునికి ప్రత్యుత్తరమిమ్ము ఆలాగు చేయని యెడల వాడు తన దృష్టికి తాను జ్ఞానిననుకొనును. సామెతలు 26:5.

ఈ ప్రపంచంలో ఎవడికి ఎలాంటి సమాధానం చెప్పి నోరు మూయ్యించాలో యావెకు తెలుసు. అయితే ఆయన తన ప్రవక్తలకు తెలియపర్చకుండా ఆయనేమియు చేయడు (ఆమోసు 3:6-8) యావె యెహెజ్కేలుతో, నోవాహుతో, యిర్మీయాతో, సౌలుతో ముందుగానే చెప్పాడు వారు వినరని: అయినా పోయి చెప్పి రమ్మన్నాడు. తరతరాల నుండీ ఆయన మాటలను చెవినిపెట్టని జనాంగం ఉంది. తిరుగుబాటు తత్వం చూపిస్తున్నా ఆయన తన ప్రవక్తల ద్వారా వర్తమానములను అందిస్తూనే వస్తున్నాడు 2దినవృత్తాంతములు 36:12-15. తోడేళ్ళ మధ్యకు గొఱ్ఱెలను పంపిస్తున్నట్లు (మత్తయి 10:16) అందుచేత ఇదిగో నేను మీ యొద్దకు ప్రవక్తలను, జ్ఞానులను, శాస్త్రులను పంపుచున్నాను. మీరు వారిలో కొందరిని చంపి, మ్రానుకేయుదురు. కొందరిని మీ సమాజ మందిరములలో కొరడాలతో కొట్టి పట్టణమునుండి పట్టణమునకు తరుముదురు. మత్తయి 23:34.
సౌలు మాట్లాడినప్పుడు మత్సరముతో నిండుకొని దూషించి ఆయన చెప్పినవాటికి అడ్డం చెప్పారు, అ॥కార్య 13:45. స్తెఫను మాట్లాడుతున్నప్పుడు సమాజమందిర అధికారులు రెచ్చిపోయి ఆయనను రాళ్ళతో కొట్టి చంపారు, అ॥కార్య 6:10.

యావె నా నోరు తెరువగా పలుకుటకు నాకు శక్తి కలిగెను. అప్పటినుండి నేను మౌనిని కాకయుంటిని (యెహె 33:22) అని యెహెజ్కేలు అంటున్నాడు.

- ఆయన యావె తన ప్రవక్తలకు మాటలు ఇచ్చి మాట్లాడించగలడు. యిర్మీయా 20:7-10
- ఆయన యావె తన ప్రవక్తలకు రహస్యములు విప్పి బయలుపర్చగలడు. ఆమోసు 3:6
- ఆయన యావె తన భక్తులకు దర్శనమిచ్చి వర్తమానములను ప్రకటించుటకు పంపువాడు. అ॥కార్య 16:8-10.
- ఆయన యావె ఏమైనా చేయగలడు. ఆయనకు అసాధ్యమైనది ఏమైనా ఉందా? లేదు. సింహము గర్జించెను, భయపడనివాడెవడు? సర్వాధికారియైన యావె ఆజ్ఞ యిచ్చియున్నాడు. ప్రవచింపకుండువాడెవడు? ఆమోసు 3:8
- ఆయన యావె తన ప్రజల పాపాలను అతిక్రమములను ఎత్తి చూపించగలవాడు. మీకా 3:8 బాకానాదం ఊది తన ప్రజల యొక్క పాపములను బహిరంగంగా గద్దించగలడు యెషయా 58:1
- ఆయన యావె శరీరరీతిగా మనమధ్య యషువ గా జీవించినవాడు, తను వచ్చి బోధింపకుంటే పాపంలేకపోవును. ఇప్పుడైతే వారి పాపమునకు మిషలేదని చెప్పాడు. యోహాను 15:22
- ఆయన యావె గాడిదకు వాక్కు యిచ్చి బిలాము నోరు మూయ్యించినవాడు. సంఖ్యా 22:28
- ఆయన యావె తన ప్రవక్తల నోటిమాటలతో వధించి, వారిని కొట్టి బద్దలు చేసేవాడు హోషేయ 6:5 గనుక తిరుగుబాటుదారులకు సువార్త/వర్తమానం ప్రకటించుట యావె ద్వారా ప్రేరేపింపబడిన వానికే సాధ్యం గాని మరే వ్యక్తికి సాధ్యం కాదు.
- ఆయన యావె తను ఎవరినైతే ఎన్నుకుని ఆ పనికి నిర్ణయించాడో అతనిని ప్రేరేపించి, బలవంతం చేసి గెలవగలడు. వర్తమానాన్ని అందించేవరకు అతనిని వదిలిపెట్టడు. యిర్మీయా 20:7-11, ప్రత్యేకంగా కొంతమందిని ఈ తిరుగుబాటుదారులకు సువార్త చెయ్యడానికే పిలిచాడు. వారు వినినా వినకపోయినా వారిమధ్య ఒక ప్రవక్త యున్నాడని వారు తెలుసుకొనునట్లు (యెహెజ్కేలు 2:4) ప్రకటింపవలసిందే. యాజకుడు ధర్మశాస్త్రము వినిపించక మానడు. జ్ఞాని యోచన లేకుండా ఉండడు. ప్రవక్త వాక్యము చెప్పక మానడు. యిర్మీయా 18:18. నోరు నొక్కివేస్తున్నా, చంపేస్తామని బెదిరించినా, చితకబాదుతున్నా, చిత్రహింసలు పెడుతున్నా యావె ఆత్మ ద్వారా రేపబడినవాడు ప్రవచింపక మానడు. ఆమోసు 3:8, యిర్మీయా 20:9, అ॥కార్య 4:19,20 ఎదురాడువానికి సమాధానం చెప్పకుండా ఉండలేడు. ఆమోసు 7:16,17, సంఖ్యా 22:23-34,

అప్పుడు యావె ఆత్మ యాజకుడగు యెహోయాదా కుమారుడైన జెకర్యా మీదికి రాగా...(2దిన 24:20) అతను ప్రవచించాడు. అంతే అందరూ అతనిని రాళ్ళతో కొట్టి చంపేసారు. ఇలా ప్రవచించే వారిని, ఉన్నది ఉన్నట్లుగా బోధించిన వారిని చాలా శ్రమలకు గురి చేస్తారు.

"బోధ" విషయంలో బోధకుడు మోమాటం లేని వాడై ఉండాలి. బోధకుడా, నీవు సత్యవంతుడవైయుండి, ఎలోహీం మార్గము సత్యముగా బోధించుచున్నావనియు, నీవు ఎవనిని లక్ష్యపెట్టవనియు, మోమాటము లేనివాడవనియు ఎరుగుదుము, మత్తయి 22:16, అటులనే యోబు 32:21,22 కూడా చదవండి. మోమాటం భయంకరమైన పాపం. ఎలోహీం దృష్టిలో ఘోరమైన నేరం. విశ్వాస విషయంలో మోమాటం పనికిరాదని యాకోబు 2:1 చెప్తుంది. గనుక బోధించేవాడు వీటిని మనస్సున ఉంచుకొని ఉన్నది ఉన్నట్లుగా బోధించాలి. డబ్బుకోసం, పదవికోసం, పరుల సంతోషం కోసం బోధచెయ్యరాదు. సత్యాన్నిసత్యంగా బోధిస్తే, ఉన్నది ఉన్నట్లుగా చెప్పగలిగితే ఈ క్రింది బాధలకు, కష్టాలకు గురి అవ్వవలసి వస్తుంది.

దుష్టులచే చంపబడవచ్చును.................. 1యోహాను 3:12
చెరసాలకు.................................... 2దినవృత్తాంతములు 16:10
రాళ్ళదెబ్బలకు............................... 2 దిన 24:20-22
హెచ్చరికలకు................................. 1దిన 25:16
భయాందోళనలకు............................ అ॥కార్య 4:17,18
ప్రజలు వినరు ................................ 2దిన 33:10
నిత్య అవమానం.............................. 2దిన 36:15,16
మారువేషంలో యుద్ధం........................ 2దిన 35:22
పగబడతారు, ద్వేషిస్తారు..................... ఆమోసు 5:10, 1రాజులు 22:8
చెంపపై కొడతారు............................ 1రాజులు 22:24
చంపుతామని బెదిరిస్తారు.................... 1రాజులు 19:2
ఆకలి బాధలకు గురిచేస్తారు................. 1రాజులు 22:27
చంప కుట్రపన్నుతారు......................... 1రాజులు 6:32
వినడానికి ఇష్టపడరు........................ 2దిన 13:8
అబద్ధ సాక్షులను నిలబెడతారు............... అ॥కార్య 6:10-14
ప్లీడర్‌నోటీసులు ఇస్తారు....................... అ॥కార్య 24:1

కోర్టులకు లాగుతారు........................ మత్తయి 10:47
ఒంటరిగా వదిలేస్తారు...................... 2తిమోతి 4:16
నిందలు మోపుతారు ....................... అ॥కార్య 6:13
చెడు పత్రికలు పంచుతారు................. 2దిన 32:16,17
తప్పుడు ప్రచారం చేస్తారు................. అ॥కార్య 6:11
నిక్‌నేమ్స్ పెడతారు.......................... అ॥కార్య 17:18
హేళన చేస్తారు.............................. అ॥కార్య 17:32
హింసిస్తారు................................ అ॥కార్య 13:50
వాదానికి వస్తారు.......................... అ॥కార్య 6:9
దారికాచి చూంపచూస్తారు................. అ॥కార్య 25:3
భారమైన నేరాలు మోపుతారు............... అ॥కార్య 25:7
యావె దూషణ చేస్తున్నడంటారు............ అ॥కార్య 18:6
వెలివేస్తారు................................. 3యోహాను 9:10
బాధలు కలుగజేస్తారు...................... అ॥కార్య 13:50
వెళ్ళగొడతారు............................. అ॥కార్య 13:50
మా ప్రదేశం వదిలిపొమ్మంటారు............మత్తయి 8:34
పిచ్చివాడంటారు...........................మార్కు 3:21
అవమానం, అపహాస్యం చేస్తారు............ యిర్మీయా 20:8

ఫరో సేవకులు మోషేను చూసి – వీడు ఎంతకాలము మనకు ఉరిగా ఉండును నిర్గమ 10:7 అని అన్నారు. ఆమోసును కుట్రదారుడు అన్నారు ఆమోసు 7:10. యిర్మీయాను జగడమాడువాడని, దేశస్థులందరితో కలహించువాడని అన్నారు యిర్మీయా 15:10. మెస్సీయ శిష్యుడైన సౌలును వదరబోతని, పీడవంటివాడని, పిచ్చివాడని, అతివిద్యవలన పిచ్చిపట్టినదని ఇంకా రకరకాలుగా అన్నారు. యథార్థవంతులు ఎప్పుడూ ముండ్లకంచెలకన్నా ముండ్లుగా ఉందురు. మీకా 7:4. మెస్సీయను అయితే దయ్యముల అధిపతియని, మతిచలించినవాడని, అక్రమకారుడని, మోసగాడని ఇంకా రకరకాలుగా అన్నారు. అబద్ధ బోధకులనైతే ఎంతో ఆదరించి శాలువాలు కప్పి బహుమతులిచ్చి, బిరుదులపెట్టి గౌరవిస్తారు లూకా 6:25,26. సత్యసంబంధులకు మాత్రం నిక్‌నేమ్స్ పెట్టి సమాధులు కడతారు. మత్తయి 23:34. ఇంకా ఎన్నెన్నో చేస్తూ ఉంటారు.(ఇంకా లిస్ట్ కావాలా, వ్రాయండి) గనుక యావెజనుడు వారి క్రియలను గుర్తించుకొని చాలా జాగ్రత్తగా యావె జ్ఞానముతో వారికి సువార్త బోధింపవలసివుంది. ఈ మిషనులు, సంస్థలను నడిపే పెద్ద పెద్ద అయ్యగార్లు, రెవరెండ్లు, వారిని వెంబడించే జనాంగము అంతా యావె మీద, ఆయన సత్యం మీద తిరుగుబాటు చేయుచున్నవారే, భక్తులుగా నటిస్తూ సత్యాన్ని ఖూనీ చేస్తున్న సాతాను రాయబారులు (2కొరింథీ 11:13–15) పైకి భక్తివేషం, లోన యుక్తి, కుయుక్తి వేషం ధరించిన సాతాను పరిచారకులు. వీరే చాలా భయంకరమైన వారు అయితే బైబిలేమి చెప్తుంది? వాళ్ళకి భయపడాల్సిన పని లేదని ఖండితంగా చెప్తుంది. చదవండి ఈ వాక్యాలు. వాక్యంతో కొడితే వాళ్ళ ముఖాలు పగిలిపోతాయని ఖండితంగా బోధిస్తుంది. యెహెజ్కేలు 3:8,9, 1యోహాను 4:4, లూకా 21:15, కీర్తనలు 119:98,99,100, యిర్మీయా 5:14. యావెజనుడు వాక్యం కలిగివుండాలి గాని పై వేషం కాదు. వాక్యం ద్వారా జనాన్ని ఆకర్షించాలి గాని డబ్బుతోనూ, సంగీతంతోనూ, షోఅప్ తోనూ కారాదు. ఎందుకంటే యావె వాక్యం ఎలాంటిదో చూద్దాం.

**1.హృదయాన్ని పొడుస్తుంది:** వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని... అ॥కార్య 2:37

**2. హృదయాన్ని నరుకుతుంది:** వారు ఈ మాట విని అత్యాగ్రహము తెచ్చుకొని...అ॥కార్య 5:33

**3. కాల్చివేస్తుంది:** నా వాక్యము వారిని కాల్చునట్లు నీ నోట వాటిని అగ్నిగాను ఈ జనమును కట్టెలు గాను నేను చేసెదను.....యిర్మీయా 5:14

**4.హృదయరహస్యములను బయటపెట్టును:** అందరి బోధవలన తాను పాపినని గ్రహించి, అందరివలన విమర్శింపబడును. అప్పుడతని హృదయరహస్యములు బయలుపడును. 1కొరింథీ 14:24

**5.హృదయంలో మండుతుంది:** ఆయన త్రోవలో మనతో మాటలాడుచూ లేఖనములను మనకు బోధపరచుచున్నప్పుడు మన హృదయము మనలో మండుచుండలేదా అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి. లూకా 24:32

**6.దేశము సహించలేకపోతుంది:** అతని మాటలు దేశము సహింపజాలదు అని తెలియజేసెను. ఆమోసు 7:11

**7.కఠినమైనది గనుక వినలేరు:** ఆయన శిష్యులలో అనేకులు ఈ మాట విని యిది కఠినమైన మాట యిది ఎవడు వినగలడని చెప్పుకొనిరి. యోహాను 6:60

**8.విననొల్లని బాధ కలిగిన మాటలు:** యాజకుడు ధర్మశాస్త్రము వినిపించకమానడు, జ్ఞాని యోచన లేకుండా నుండడు. ప్రవక్త వాక్యము చెప్పకమానడు, వానిని మాటలలో దేనిని వినకుండ మాటలతో వానిని కొట్టుదము రండి అని చెప్పుకొనుచుండిరి. యిర్మీయా 18:18

**9.వెలుగు, తెలివి అవసరంలేని వానికి కష్టమే**: నీ వాక్యములు వెల్లడి అగుట తోడనే వెలుగు కలుగును అవి తెలివిలేనివానికి తెలివి కలిగించును. కీర్తనలు 119:130

**10.చీకటి సంబంధులు గ్రహించరు:** ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను. యోహాను 1:5

**11.నటించేవారికి చాలా కఠినం:** యరోబాము భార్యా! లోపలికి రమ్ము నీవు వేషము వేసికొని వచ్చుట ఏల? కఠినమైన మాటలు నీకు చెప్పవలెనని నాకు ఆజ్ఞఆయెను 1రాజులు 14:6

**12.బండను పగులగొట్టే సుత్తి:** నా మాట అగ్నివంటిది కాదా! బండను బద్దలు చేయు సుత్తెవంటిది కాదా? యిర్మీయా 23:29

**13.పాదాలకు దీపం, త్రోవకు వెలుగు:** నీవాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగైయున్నది. కీర్తనలు 119:105

**14.అద్దము వంటిది:** ఎవడైనను వాక్యమును వినువాడైయుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. యాకోబు 1:23

**15.అక్షయ విత్తనము:** మీరు క్షయ బీజము నుండి కాక, శాశ్వతమగు జీవము గల ఎలోహీం వాక్యమూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు. 1పేతురు 1:23

**16.తేనెకంటె తియ్యనిది:** నీ వాక్యములు నా జిహ్వాకు ఎంతో మధురములు అవి నా నోటికి తేనెకంటె తీపిగా నున్నవి. కీర్తనలు 119:103

**17.ఆరోగ్యకరమైన మాటలు:** ఇంపైన మాటలు (ప్రసంగి 12:10) తేనె పట్టువంటివి. అవి ప్రాణమునకు మధురమైనవి. యెముకలకు ఆరోగ్యకరమైనవి సామెతలు 16:24

**18.పాలువంటివి, బలమైన ఆహారం కూడా:** క్రొత్తగా జన్మించిన శిశువును పోలినవారై నిర్మలమైన వాక్యమును పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి. 1పేతురు 2:3, హెబ్రీ 5:14

**19.సంతోషము, హృదయానికి ఆనందము:** నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి. యిర్మీయా 15:16

**20.అబద్ధికులకు, తిరుగుబాటుదారులకు మరణం:** అ॥కార్య 5:3,9 + 1రాజులు 13:22

**21.యదార్థవంతులకు క్షేమసాధనములు:** యథార్థముగా ప్రవర్తించువానికి నా మాటలు క్షేమసాధనములు కావా? మీకా 2:7

**22.తిరుగుబాటుదారులకు అడ్డం:** తిరుగుబాటు చేయువారి దారికి అది అడ్డము గనుక వారు తొట్రిల్లుదురు హోషేయ 14:9

**23.విమర్శలో తొట్రిల్లుదురు:** నేను వారిని విమర్శించు కాలమున వారు తొట్రిల్లుదురని యావె సెలవిచ్చుచున్నాడు యిర్మీయా 6:15

**24.ములుకోల వంటి మేకులు:** జ్ఞానులు చెప్పు మాటలు ములుకోలల వలెను చక్కగా కూర్చబడి బిగగొట్టబడిన మేకులవలె ఉన్నవి. ప్రసంగి 12:11

**25.గండ్రగొడ్డలి** దానితో జనాలను విరగగొట్టగలడు. యిర్మీయా 51:20–23

**26 రెండంచుల శక్తి గల ఖడ్గ** హెబ్రీ 4:12

**27.అధికారము, ధైర్యము కలిగినది** ఆయన శాస్త్రుల వలె కాక అధికారము గలవానివలె వారికి బోధించెను. మత్తయి 7:29 వారు పేతురు, యోహానుల ధైర్యము చూచినప్పుడు అ॥కార్య 4:13

రాజు ఈ సంగతులెరుగును గనుక అతని యెదుట నేను ధైర్యముగా మాటలాడుచున్నాను. అ॥కార్య 26:26 వాక్యము బోధించుటయందు ఆతురురతగలవాడై యషువయే మెస్సీయ అని యూదులకు దృఢముగా సాక్ష్యమిచ్చుచుండెను. అ॥కార్య 18:5 యావె దాసులు ధైర్యంగా, ఆత్మ ప్రేరేపణతో వాక్యం బోధిసారు గనుకనే చాలా మంది అబద్ధబోధకులు తాళలేక –

1. ఈ విధంగా ప్రవచింపవద్దని.......................... ఆమోసు 2:12
2. ఈ విధంగా చెప్పవద్దని.............................. యెషయా 30:9–13
3. ఈ నామాన్ని బోధించవద్దని.......................... అ॥కార్య 4:18
4. ప్రవచించడం ఆపమని................................ సంఖ్యా 11:12
5. ప్రవచిస్తే చంపుతామని.............................. యిర్మీయా 11:21
6. ఈ ప్రసంగం ఇక్కడ కాదని.......................... ఆమోసు 2:16
7. ఇలాంటి మాటలు ఇక్కడ చెప్పవద్దని.................. ఆమోసు 7:12
8. మేము చెప్పినట్లు చెయ్యండి అని...................... సంఖ్యా 22:
9. అనుకూల బోధ చెయ్యమని............................ 2తిమోతి 4:3,4
10. నా కోసం వారిని శపించమని......................... సంఖ్యా 22:6
11. వర్తమానాన్ని మార్చమని ............................ అమోసు 7:16
12. మా మిషనుకి వ్యతిరేకంగా బోధ చెయ్యవద్దని........... ఆమోసు 7:13
13. అబద్ధాలతో దారి తప్పించటం......................... 1రాజులు 13:18
14. అడ్డుకోవడం, ఆటంకపరచడం.......................... మార్కు 9:38
15. అతని ప్రసంగం వినవద్దని ప్రచారం చెయ్యడం..........యిర్మీయా 18:18
16. పరలోక రాజ్య ద్వారాన్ని మూయడం.................... మత్తయి 23:14
17. విశ్వసించేవారిని ఆటంకపరచడం....................... మార్కు 9:42
18. తిన్నని మార్గాన్ని చెడగొట్టడం......................... అ॥కార్య 13:10
19. అడ్డం చెప్పడం.......................................... అ॥కార్య 13:45
20. మా అయ్యగారి గూర్చి తప్పుగా మాట్లాడవద్దని............ఆమోసు 7:16
21. అతని బోధ వినడానికి వెళ్ళవద్దని.........................లూకా 13:14
22. నాజీరులకు ద్రాక్షారసం త్రాగిస్తారు...................... ఆమోసు 2:12
23. సత్యాన్ని బోధించేవారిని తప్పుడువారిగా చిత్రిస్తారు.......యిర్మీయా 20:10
24. ఎక్కడ తప్పుకి దొరుకుతాడా అని చూస్తూఉంటారు........యిర్మీయా 20:19
25. చెడ్డవాడని ప్రచారం చెయ్యమంటారు..................... యిర్మీయా 20:10

మొదలగు పనులు చేస్తూ సలహాలు ఇస్తూ ఉంటారు. అయితే ఏది ఏమయినా యావె జనునికి యావె చెప్పిన మాట ముఖ్యం గాని ప్రజల సలహాలు, ప్రజల ఆలోచనలు ముఖ్యం కాదు. వినువాడు వినును గాక విననొల్లనివాడు విననొల్లక యుండును గాక. యెహెజ్కేలు 3:47

ఆత్మ సమాజములతో చెప్పుచున్నమాట చెవిగలవాడు వినును గాక. ప్రకటన 2:7,11,17,29 3:6,13,22

# సర్వాధికారియైన యావెకు మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను

– బ్రదర్. పి. రాజు

ఆదియందు ఎలోహీం భూమ్యాకాశములను సృజించాడు. ఆయన ఆరు దినములలో సమస్తాన్ని నిర్మించాడు. మొదటిగా భూమిని ఆకాశమును వేరుపరిచాడు. చీకటిని వెలుగును వేరుపరిచాడు. పగలు వెలుగిచ్చుటకు సూర్యున్ని రాత్రి వెలుగిచ్చుటకు చంద్రుణ్ణి, నక్షత్రాలను చేసాడు. రకరకాల చెట్లను విత్తనములిచ్చు ఫలవృక్షములను, భూచరాలను, జలచరాలను రకరకాల నేలను ప్రాకెడి పురుగులను సృజించాడు. ఆఖరిగా తన స్వరూపమందు నరుని సృజించాడు. ఆయన నరుని ఆశీర్వదించి సకలజీవరాశులను ఏలుకోమన్నాడు. నరుని కోసం ఒక తోటను చేసి ఆ తోటలో నరుని ఉంచి ఆ తోటను సేద్యపరచుకొనుచూ ఆ తోటలో గల వృక్షఫలములను తినమన్నాడు. కాని ఆ తోటలోనున్న మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదని చెప్పాడు. అతడు వాటిని తిను దినమున చనిపోతాడని నరునికి ఖండితముగా ఆజ్ఞాపించాడు. నరునికి సాటియైన సహాయం చేసాడు. ఆదాము, హవ్వలు ఏదేను తోటలో హాయిగా కాలం గడుపుచున్న సమయంలో సాతాను రంగప్రవేశం చేసాడు. పరమతండ్రి యొక్క కార్యాలను పాడుచేయాలని ప్లాన్ వేసాడు. ఎలోహీమైన యావె ఏదైతే చేయవద్దని ఆదామునకు ఆజ్ఞాపించాడో, ఆ పని చేయించుట ద్వారా ఎలోహీంనకు కోపం రప్పించి తద్వారా నరుడిని నాశనం చేయించడం ద్వారా భూమిమీద నరుడన్న వాడే లేకుండా చేయాలని ఆలోచన చేసాడు. ఇందుకు హవ్వను ఎన్నుకున్నాడు. హవ్వను లోబరచుకొని హవ్వ ద్వారా ఆదామును ఆజ్ఞకు వ్యతిరేకమైన కార్యం చేయించాడు. కాని కృపామయుడైన తండ్రి తన కుమారుని పై జాలిపడి వారిని వెంటనే చంపలేదు. దిగంబరులైన ఆదాము, హవ్వలకు తనే వస్త్రాలు చేసి తొడిగించాడు. ఏదేను తోటలోనుండి వారిని బయటకు సాగనంపి భూమిని కష్టించి సేద్యం చేసుకొమ్మని ఆజ్ఞాపించాడు. ఈ విధంగా సాతాను ప్రణాళిక భగ్నమైంది. ఆ తర్వాత ఆదాము కుమారులైన కయీను, హేబేలులలో హేబేలు నీతిమంతుడు. అతడిని కయీను కొట్టి చంపాడు. కయీను శపింపబడిన వాడై దేశదిమ్మరి అయ్యాడు. క్రమక్రమముగా భూమిమీద మానవజాతి విస్తరించిన తర్వాత సాతాను వారిని విచ్చలవిడిగా జీవించునట్లుగా ప్రేరేపించాడు. దూతలు, నరుల కుమార్తెలతో వ్యభిచారం చేయడం ద్వారా భూమి బలాత్కారముతో నింపాడు. ఆ తరము వారిలో నోవహు మాత్రమే వారి పాపంలో పాలుపంచుకోకుండా ఎలోహీంయందు భయభక్తులు కలిగి జీవించాడు. ఎలోహీం నోవహుచేత మిగిలిన వారికి 120సం॥లు సువార్త ప్రకటింపజేసాడు. ఆ విధంగా వారిని పాపంలో నుండి బయటకు లాగాలని సాతాను బంధకములలోనుండి వారిని విడిపించాలని ఎలోహీం ఆలోచించాడు. కాని వారు వినలేదు. పాపకార్యాలు ఆపలేదు "సర్వశరీరులు తమ మార్గాలను చెరిపివేసుకొన్నారు" అని లేఖనం సెలవిచ్చుచున్నది. అప్పుడు నోవహు అతని కుటుంబాన్ని తప్పించి మిగిలిన వారినందరిని జలప్రళయం ద్వారా నాశనం చేసాడు. ఆ తర్వాత నోవహు కుటుంబం ద్వారా భూమి మీద సంతానాన్ని విస్తరింపజేసాడు. నోవహు కుమారుడైన హాము కుమారుడైన కూషు విగ్రహారాధికుడు. అతని కుమారుడైన నిమ్రోదు తదనంతర కాలంలో తమ్మూజు దేవతగా పూజింపబడ్డాడు. ఎలోహీం నోవహు మొదటి కుమారుడైన షేమును ఆశీర్వదించాడు. షేము యావెయందు విశ్వాసముంచి ఆయన ఆజ్ఞచొప్పున జీవించాడు. కాబట్టి ఎలోహీం అబ్రహాముతో నిత్యనిబంధన చేసాడు. **నీకును నీ తరువాత నీసంతతికిని నీవు పరదేశివైయున్న దేశమును అనగా కనాను దేశమంతటిని నిత్యస్వాస్థ్యముగా ఇచ్చి వారికి ఎలోహీంనై యుందునని అతనితో చెప్పెను** (ఆది 17:8) ఆ విధంగా ఎలోహీమైన యావె అబ్రహామునకు నూరేండ్ల వయసులో ఇస్సాకును పుట్టించెను. ఇస్సాకునకు యాకోబు సంతానమైన 12మంది కుమారులు వారి బిడ్డల బిడ్డలు వీరందరు యోసేపు ద్వారా ఐగుప్తుదేశంలో నివసించిరి. ఆ దేశంలో వీరు విస్తారంగా అభివృద్ధి చెందారు. ఐగుప్తు దేశంలో కొంతకాలం కఠిన దాస్యత్వం అనుభవించాక మోషే నాయకత్వంలో వారు ఐగుప్తునుండి వెలుపలికి వచ్చారు. మార్గమధ్యములో వారి శత్రువులను నశింపజేసి వారిని సీనాయి పర్వతము దగ్గరకు తీసుకొని వచ్చాడు. అచ్చట వారికి నీతియుక్త ఆజ్ఞలను కట్టడలను గల ధర్మశాస్త్రమును అనుగ్రహించాడు. వారితో నిబంధన చేసాడు. కాని యిశ్రాయేలీయులు ఎలోహీమైన యావె చేసిన మేళ్ళను మరచిపోయి పలుమార్లు ఆయన మీద, ఆయన సేవకుడైన మోషే మీద తిరుగుబాటు చేసారు. ఒక ప్రక్క సీనాయి పర్వతము మీద **"నీ ఎలోహీమైన యావెను నేనే. నేను తప్ప వేరొక ఎలోహీం నీకుండకూడదు. పైన ఆకాశమందుగాని, భూమియందుగాని, భూమిక్రిందయుండు నీళ్ళయందే గాని ఉండు దేని రూపమునయినను విగ్రహమునైనను చేసుకొనకూడదు. వాటికి సాగిలపడకూడదు. వాటిని పూజింపకూడదు."** అని ఎలోహీం మోషేకు ఆజ్ఞాపిస్తుంటే పర్వతం క్రింద ప్రజలు వెండి బంగారాలతో ఒక దూడను చేసుకొని–ఓ యిశ్రాయేలూ, ఐగుప్తుదేశములోనుండి నిన్ను రప్పించిన నీ ఎలోహీం ఇదే అని ఆ దూడను పూజించారు. ఇది మొదలుకొని పలుమార్లు అన్యదేవతలను వారు పూజించారు. విగ్రహారాధన విషయమై ఎలోహీం చాలా స్పష్టమైన ఆజ్ఞనిచ్చాడు. **మీ హృదయము మాయలలో చిక్కి త్రోవ విడచి యితర దేవతలను పూజించి వాటికి నమస్కరింపకుండ మీరు జాగ్రత్తపడుడి.** (ద్వితీ 11:16) **మీరు స్వాధీనపరచుకొనబోవు జనములు గొప్ప పర్వతములు గొప్ప పర్వతముల మీద నేమి, మెట్టలమీదనేమి, పచ్చని చెట్లన్నిటి క్రిందనేమి, యెక్కడైతే తమ దేవతలను పూజించెనో ఆ స్థలములన్నిటిని మీరు బొత్తిగా పాడుచేయవలెను. వారి బలిపీఠములను పడద్రోసి వాటి పేరులు అచ్చట లేకుండా నశింపజేయవలెను.**(ద్వితీ 12:2–4) అని ఆజ్ఞాపించినా వారు విగ్రహాలను పూజించారు. వాటికి బలిపీఠాలు కట్టి బలులు నైవేద్యాలు అర్పించారు. వారిని ఏలిన రాజులు కూడా, ఒకరు యావెయందు భయభక్తులు కలిగి జీవిస్తే మరొకరు విగ్రహారాధన చేసేవారు. వీరి వైఖరితో విసుగెత్తిన ఎలోహీం వీరిని పలుమార్లు వారి

శత్రువుల చేతికి అప్పగించాడు. తన ప్రజలకు పశువులకున్న జ్ఞానం కూడా లేదని యెషయా ద్వారా వాపోతున్నాడు ( యెషయా 1:1-4) **నా జనులు రెండు నేరములు చేసియున్నారు; జీవజలముల ఊటనైన నన్ను విడిచి యున్నారు. తమ కొరకు తొట్లను, అనగా బద్దలై నీళ్ళు నిలవని తొట్లను తొలిపించికొనియున్నారు.** (యిర్మీయా 2:13) అని యిర్మీయా ద్వారా ప్రకటిస్తున్నాడు. యిశ్రాయేలీయుల విగ్రహారాధన ఫలితంగా వీరిని మొదట నెబుకద్నెజర్, మాదీయులు, పారసీకులు ఆ తర్వాత రోమీయులు వీరిని పాలించారు. అంతేగాక ప్రపంచమంతటా వీరిని చెదరగొట్టాడు. ఆయా దేశాలలో వీరు ఎన్నో బాధలు పడ్డారు. ఇలా చాలాకాలం జరిగిన తరువాత ఎలోహీమైన యావె తన ప్రజలైన యిస్రాయేలీయుల పట్ల జాలి చూపి తాను వారి పితరులైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబులతో చేసిన నిబంధన ప్రకారం వారిని తమ స్వదేశములో ప్రవేశపెట్టాడు. 1948 సం॥లో తిరిగి ఒక జాతిగా, ఒక దేశముగా యిస్రాయేలీయులు ఏర్పడ్డారు. ఆ దేశంలో వారు తమ పితరుల ఎలోహీమైన యావెను భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. విశ్రాంతి, నెలపొడుపు, పండుగదినములు ఒకటేమిటి వారికి పరమతండ్రి ఆజ్ఞాపించినది యావత్తు ఆచరించుచున్నారు. ఈ రోజు ప్రపంచములో అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తున్న దేశం యిస్రాయేల్!!! యిస్రాయేలీయులు కాని అన్యుల పరిస్థితి చూచినట్లయితే వారు ఇంకనూ విగ్రహారాధనలో మునిగి తేలుతున్నారు. సర్వసృష్టికర్తయైన యావె **"భూదిగంత నివాసులారా, నా వైపు చూచి రక్షణ పొందుడి. ఎలోహీంను నేనే మరి ఏ ఎలోహీం లేడు"** (యెషయా 45:22) అని సమస్త మానవాళికి ఆజ్ఞాపిస్తుంటే దానికి వ్యతిరేకంగా కొన్ని కోట్ల నకిలీ దైవాలను సృష్టించి వాటికి లేని పోని మహిమలు కల్పించి, కల్పనా కథలు పుట్టించి మానవులు ఆయా దైవాలను పూజించునట్లు సాతాను వారి మహిమలను ప్రభావితం చేశాడు. మట్టినుండి మనిషిని తయారుచేసి అతనికి జీవాయువు ఊది అతను జీవించడానికి సమస్తమును లోబరచిన సృష్టికర్తయైన యావెను వదిలి సాతాను మాయలోపడి తమ కున్న వెండి బంగారాలతో తమకిష్టమైన రీతిలో విగ్రహాలు చేసికొని వాటిని పూజిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు తమ స్వలాభం కోసం ఎలోహీం విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. జీవముగల ఎలోహీంను వదిలి మూగరాతిబొమ్మలకు మ్రొక్కునట్లు ప్రజలను ప్రేరేపిస్తున్నారు. ఎలోహీమైన యావె ఆదినుండి తాను జరిగించిన కార్యములను, మహాత్కార్యములను, అద్భుతాలను భూతవర్తమాన భవిష్యత్ కాలాల్లో సంభవించబోయే సంఘటనలను ఆయా కాలాల్లో కొందరు భక్తుల చేత రచింపజేసి రాబోవు తరాలువారు వాటిని చదివి గ్రహించి తన యందు భయభక్తులు కల్గియుండులాగున వాటిని గ్రంథస్థం చేయించారు ఆ గ్రంథంలోని వాక్యాలను దివారాత్రము ధ్యానించువాడు ధన్యుడు అని భక్తుడైన దావీదు సెలవిచ్చాడు. అపోస్తలుడైన యోహాను ఆ వాక్యమే ఎలోహీం అని తెలియజేస్తున్నాడు. అటువంటి పరిశుద్ధ గ్రంథమునకు దీటుగా సాతాను మాయాదేవుళ్ళను, దేవతలను సృష్టించి వారు కూడా ఎన్నో అద్భుతాలు చేసినట్లు అబద్ధాలు కల్పించి వారే నిజమైన సృష్టికర్తలు అని నమ్మించడానికి కొన్ని కల్పిత గాధలు పుట్టించి వాటిని గ్రంథస్థం చేయించాడు అపవాదియైన సాతాను ఇటువంటి గ్రంథాలు వేలకొలదిగా లోకంలో ఉన్నాయి. ఇవి మానవులకు పవిత్రగ్రంథాలయ్యాయి. ఇటువంటి గ్రంథాలన్నిటికంటే మిన్నగా జీవముగల ఎలోహీం గురించిన పరిశుద్ధ గ్రంథం ప్రపంచంలోనే అత్యధికముగా అమ్ముడవుచున్న గ్రంథంగా ప్రసిద్ధి చెందింది. ఒక సర్వే ప్రకారం అంతర్జాతీయంగా నిమిషానికి 50 బైబిల్స్ అమ్ముడవుతున్నట్టు అంచనా.అంటే గంటకు 3000 బైబిళ్ళు, రోజుకు 72000 బైబిళ్లు అమ్ముడవుతున్నాయన్నమాట. సాతాను ఎంత కుతంత్రాలు పన్ని ప్రజలను వారి సృష్టికర్తయైన ఎలోహీం గురించిన జ్ఞానానికి దూరంగా ఉంచుదామని ప్రయత్నాలు చేస్తున్నా వాటన్నింటిని అధిగమించి తనను గురించిన పరిశుద్ధ గ్రంథమును ప్రజలందరికి అందుబాటులోనికి తీసుకొనివచ్చాడు పరమతండ్రియైన యావె. అయినా మనుష్యులు ఆత్మీయ గుడ్డితనం వల్ల ఆ ఏర్పాటును చూడలేక సాతాను మాయలోపడి పంచలోహాలతో విగ్రహాలు చేసుకొని కదల్లేని మెదల్లేని అసలు జీవమేలేని మూగబొమ్మలకు మ్రొక్కుతున్నారు. వీటికి గుళ్ళు, గోపురాలు కట్టిస్తున్నారు. వీధికి వీధికి విగ్రహాలకు సంబంధించిన గుళ్ళే. తమతోటి మనిషి కష్టాలలో ఉంటే పట్టించుకోని ఈ ప్రజలు కోట్లరూపాయిలతో బంగారు, వెండి ఆభరణాలు విలువగల వస్త్రాలు విగ్రహాలకు అప్పగిస్తున్నారు. తమ కష్టార్జితమంతా బొమ్మలకు ధారబోస్తున్నారు. ఒక ప్రముఖ దినపత్రిక ఆదివారం అనుబంధంలో ఒక కథ ప్రచురింపబడింది. ఆ కథలో పాత్రధారులు ఒక వ్యాపారి అతని ముగ్గురు కొడుకులు. ఆ వ్యాపారి తన తదనంతరం వ్యాపార బాధ్యతలు అప్పగించడానికి తన ముగ్గురు కుమారులలో ఎవరికి ఎక్కువ వ్యాపారదక్షిత ఉందో తెలుసుకోవాలనుకుంటాడు. ఒక రోజు ఆ వ్యాపారి తన ముగ్గురు కుమాళ్ళను పిలిచి వారికి ఒక్కొక్కరికి ఒక్కొక్క బండరాయిని యిచ్చి వాటితో వ్యాపారం చేయమంటాడు. కొద్దిరోజుల తర్వాత మొదటి కుమారుడు తండ్రి వద్దకు వచ్చి తనకిచ్చిన బండరాయిని చిన్న చిన్న రాళ్ళుగా చేసి వాటిని కంకరగా అమ్మానని, రూ.1000 వచ్చాయని చెప్పి వాటిని తండ్రికి ఇస్తాడు. ఆ తర్వాత రెండవ కుమారుడు వచ్చి తనకిచ్చిన బండరాయిని రోళ్ళుగా చేయించి అమ్మానని రూ.1500 వచ్చాయని చెప్పి వాటిని తండ్రికిస్తాడు. ఆఖరిగా మూడవ కుమారుడు వచ్చి తనకిచ్చి బండరాతిని ఒక విగ్రహంగా చెక్కించి దానిని ఒక చెట్టుక్రింద నిలబెట్టానని, దాని ప్రక్కన హుండీ ఏర్పాటు చేసానని ఈరోజు హుండీ ఆదాయం రూ.1000 అని ఇలా రోజూ ఎంతోకొంత సొమ్ము ఆదాయంగా వస్తూనే ఉంటుందని చెప్పి ఆ వెయ్యి రూపాయిలు తండ్రి చేతిలో పెట్టాడు. ఆ వ్యాపారి తన మూడవ కుమారుని మెచ్చుకొని అతనికే వ్యాపార దక్షిత ఉన్నదని గ్రహించి తన వ్యాపారాన్ని అతనికి అప్పగించాడు. ఇది కేవలం కథ మాత్రమే కాదు దైవం పేరుతో కొంతమంది స్వార్థపరులు చేసే మోసానికి ప్రత్యక్ష తార్కాణానికి ఇది ఉదాహరణ. తరతరాలుగా సాతాను మానవాళిని మోసం చేస్తూ నిజమైన సృష్టికర్తను వదలి కొన్ని మాయారూపాలను విగ్రహాలుగా చేసికొని వాటిని పూజించునట్లుగా ప్రజలను ప్రేరేపిస్తున్నాడు. ప్రజలు ఎప్పటికప్పుడు వారి మాయాదేవుళ్ళను, దేవతలను మరచిపోకుండా ఉండడానికి కథలు రూపంలోనూ, నాటకాల రూపంలోనూ, సినిమాల ద్వారా, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా ఆ మాయా దేవుళ్ళకు సంబంధించిన కల్పిత గాధలకు వారికి లేని మహిమలకు విపరీతమైన పబ్లిసిటీ చేయిస్తూ వాటిని ప్రజల మెదళ్లలో బలంగా నాటుకొని పోయేటట్లు చేశారు. ఆ ప్రభావంతో ప్రజలు ఆ దేవుళ్ళకు విగ్రహాలు చేయించి వాటికి వీధివీధిన గుళ్ళు గోపురాలు కట్టిస్తున్నారు. గతంలో ఎలోహీం తన స్వకీయజనాంగంగా ఎంచుకున్న యిస్రాయేలీయులు ఆయనను వదలి విగ్రహాలను పూజించి ఆ విగ్రహాలకు గుళ్ళు కట్టించినట్లు వాక్యం సెలవిచ్చుచున్నది. **"నీవు వీధివీధిని గుళ్ళు కట్టితివి, యెత్తయిన బలిపీఠములను ఏర్పరచితివి"**(యెహెజ్కేలు 16:24) అంతేగాకుండా ప్రజలు ఆ విగ్రహాలకు ఎంతో విలువైన వజ్రాలు, వెండి బంగారాలతో ఆభరణాలు వేయించి వాటికి అలంకరిస్తున్నారు. కానుకల రూపంలోనూ, చందాల రూపంలోనూ, మ్రొక్కుబళ్ళ రూపంలోనూ, ఎంతోడబ్బును ఇతరవస్తువులను ఆ విగ్రహాలకు సమర్పించుకొంటున్నారు. దీంతో మనుషుల కంటే విగ్రహాలకే ఎక్కువ ఆస్తిపాస్తులు సమకూరాయి. కోట్లాది రూపాయిల విలువైన ఆస్తులు విగ్రహాల పేర ఉన్నాయి. వీటితో ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. విగ్రహాలు చేసికొని బ్రతికేవారు, విగ్రహాల తరుపున యాజకత్వం చేసేవారు కోకొల్లలుగా ఉన్నారు. వీరు ప్రజలను నానాటికీ విగ్రహారాధికులుగా తయారుచేస్తున్నారు. వీరందరు సాతాను ఏజంట్లు. అపోస్తలుడైన సౌలు ఏథెన్సు పట్టణంలో ఉన్నప్పుడు ఆ పట్టణం విగ్రహాలతో నిండిపోవుట చూచి సౌలు ఆత్మ పరితాపం పట్టలేకపోయింది. అక్కడ ఉన్న ప్రజలతో వాదించి వారిలో కొందరిని యషువ మెస్సీయ నొద్దకు నడిపించాడు. అదేవిధంగా ఎఫెసు, దాదాపు ఆసియా అందంతట బహు జనమును చేతులతో చేయబడినవి దేవతలు కావని చెప్పి ఒప్పించాడు. ఈవిధంగా జరుగుచుండగా దేమేత్రియను ఒక కంసాలి "అర్తెమదేవి" అనే దేవతకు వెండి గుళ్ళు చేయించుటవల్ల ఆ పని వారికి చాలా డబ్బు సంపాదించుకొనేవారు. ఇలాంటివారికి సౌలు గారు బోధల వల్ల లాభం పోయింది. దాంతో దేమేత్రి తనలా విగ్రహాలు చేసికొని డబ్బు సంపాదించేవారినందరినీ పోగుచేసి ప్రజలను రెచ్చగొట్టించి వారందరు కలిసి నానా అల్లరి చేశారు. ఈనాడు కూడా ఎంతోమంది దేమేత్రిలు మన మధ్యలో ఉన్నారు. విగ్రహాలు తయారుచేయడం, విగ్రహాలకు సంబంధించి చిత్రపటాలు, వారికి సంబంధించిన వస్తువులు, విగ్రహాలను ఉంగరాలుగా గొలుసులుగా తయారుచేసి వాటిని అమ్ముకుని జీవించేవారు, అంతేగాకుండా సాధారణమైన దారపు పోగులను ఏవో మహిమలు గలవాటిగా ప్రచారం చేసి వాటిని తాళ్ళుగా, తాయెత్తులుగా అమ్ముకొని జీవించే వారందరూ దేమేత్రి వారసులే. ఏదైతేనేమి ఈ విగ్రహారాధన పేరు చెప్పుకొని కోట్లకొలది వ్యాపారం జరుగుచున్నది.

విగ్రహారాధన నుండి బయటకు వచ్చామని చెప్పుకొనుచూ క్రైస్తవులు కూడా విగ్రహారాధన చేస్తున్నారు. పరమతండ్రి యొక్క వాక్యమైన పరిశుద్ధ గ్రంథం పోపుల చేతిలోపడ్డాక పరమతండ్రియొక్క సత్యమార్గాన్ని వారొక మతంగా చేశారు. పరిశుద్ధ గ్రంథంలో చాలా మార్పులు చేసారు. సర్వమానవాళికి ఎలోహీం ఇచ్చిన ఆజ్ఞలలో మొదటిది మరియు అత్యంత ప్రాముఖ్యమైన ఆజ్ఞకు వ్యతిరేకంగా రోమన్ కథోలిక్ మతాధిపతులు త్రిత్వాన్ని పుట్టించారు. విగ్రహారాధనను ప్రవేశపెట్టారు. నేడు ఎక్కడ చూసినా, చర్చిలలో, ఇండ్లలో విగ్రహాలు, చిత్రపటాలు, సిలువలు సాక్ష్యాత్కరిస్తున్నాయి. ఇవేమి కూడా గ్రంథంలో లేవు. అయినా ఆత్మీయ గుడ్డితనంతో బాధపడుచున్న క్రైస్తవులు వీటన్నిటినీ అనుసరిస్తున్నారు. అన్యులలో జరుగుచున్నట్లుగా సిలువను ఉంగరాలుగా, గొలుసులుగా తయారుచేసేవారు యషువ మెస్సీయ ఎలాగుంటాడో తెలియకపోయినా ఆయన పేరుమీద ఒక రూపాన్ని చిత్రించి కోట్లకొలది ఆ చిత్రాలను తయారుచేసేవారు కూడా ఎక్కువమందే ఉన్నారు. ప్రతీ సం॥రం క్రిస్మస్, న్యూఇయర్ల పేరట జరిగే తంతు అంతా ఇంతా కాదు. లోకరక్షకుడైన యషువ మెస్సీయ డిశెంబర్ 25వ తేదీన పుట్టినట్లు గాని, జనవరి 1వ తారీఖు క్రొత్త సంవత్సరంగా ఆచరించినట్లుగాని ఎటువంటి లేఖనాధారాలు లేకపోయినా, వీటిని అత్యంత అట్టహాసంగా ఆచరిస్తున్నారు. ఈ మాయా పర్వదినాలకు సంబంధించి గ్రీటింగ్ కార్డులు, చిత్రపటాలు, కేలండర్లు, బొమ్మలు, స్టార్ల పేరట బిలియన్ల కొద్దీ బిజినెస్ ప్రపంచమంతా జరుగుచున్నది. కాని డిశెంబర్ 25న తమ్మూజు అనే దేవత పండుగరోజు అని ఎంతమందికి తెలుసు? తెలియజేస్తున్నా నమ్మే వారెవరు? నమ్మినా దానినుండి బయటకు వచ్చేవారెందరు? ఇక అన్యజనులలో తరాలు మారేకొద్దీ క్రొత్త క్రొత్త దేవుళ్లు, దేవతలు పుట్టుకొస్తున్నట్లు, క్రైస్తవ్యంలో కూడా సాతాను పోపుల ద్వారా ఒకక్రొత్త దైవాన్ని సృష్టించాడు. ఆ దైవం పేరు "మరియ" ఈవిడ కేవలం ఒక సాధారణ స్త్రీ జీవితం జీవించి చనిపోయిన స్త్రీమాత్రమే. కేవలం యషువ మెస్సీయకు జన్మనిచ్చినందుకు ఈవిడను ఒక దేవతగా చేసి ఆరాధించడం మొదలుపెట్టింది రోమన్ కథోలిక్ సంఘం. దానినే అనుసరిస్తున్నారు చాలామంది క్రైస్తవులు. రోమన్ కథోలిక్లకు సంబంధించిన ప్రతీ ప్రదేశంలో మరియ (మేరి) విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. ఈ దేవత పేరు మీద హాస్పిటల్స్, స్కూల్స్, కాలేజీలు కట్టిస్తూ ఈ దేవతకు విపరీతమైన పబ్లిసిటీ కల్పిస్తున్నారు. అన్యుల దేవుళ్ళకు జరుగుచున్నట్లు ఈ దేవతకు కూడా పూజలు, జపాలు, జాతరలు, సంబరాలు, ఉత్సవాలు చేస్తున్నారు. ఈ దేవతకు నిర్మలగిరిమీద గుణదల మాత, వేళాంగిణి మాత అంటూ ఊరికో పేరు. ఇది సరిపోక మనుష్యులు తమ మధ్య జీవించిన మనుష్యులను వారు చనిపోయిన తరువాత విగ్రహాలుగా చేసికొంటున్నారు. మొదట్లో ఏవైనా గొప్ప గొప్ప పనులు దేశం కోసం చేసిన వారి విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠించేవారు. రాన్రాను మతాల వారీగా, కులాల వారీగా ప్రాంతాలవారీగా ఏ చిన్న మంచి పని చేసినా వారికి విగ్రహాలు నెలకొల్పుతున్నారు. ఈవిడకు వీధికి వీధికి విగ్రహాలు ఉన్నాయి. సినిమా హీరో, హీరోయిన్లు ఆయా క్రీడలలో ప్రసిద్ధి చెందినవారికి కూడా విగ్రహాలు, గుళ్ళు కూడా కట్టేస్తున్నారు. ఇదొక పెద్ద వ్యసనంలా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే భూమి అంతా విగ్రహాలతో నిండిపోయింది. ప్రియమైన సహోదరీ సహోదరులారా! ఎవరైనా ఏ రంగంలోనైనా పేరు ప్రతిష్ఠలు పొందినవారిని మనం మార్గదర్శకులుగా భావించుకోవచ్చు, వారిని స్ఫూర్తిగా తీసికొని మనం కూడా గొప్ప గొప్ప పనులు చేయాలనుకోవచ్చు. అంతేగాని పరమతండ్రి స్థానం వారికి ఇవ్వకూడదు. అది పాపం. ఏ వ్యక్తినీ పరమతండ్రితో సమానం చేయకూడదు. ఎలోహీమైన యావె మాత్రమే పూజ్యనీయుడు. ఆరాధ్యనీయుడు. ఆయన మాత్రమే సమస్తమును తన చిత్తప్రకారం జరిగించుకోగల శక్తి సామర్థ్యాలు కలవాడు. అటువంటి సర్వశక్తిమంతునితో ఎంతకాలం జీవిస్తాడో తెలియని అస్థిరులైన మానవుని పోల్చడం అవివేకమైన పని. **మేము సమానులమని నన్ను ఎవనికి సాటిచేయుదురు? మేము సమానులమని యెవని నాకు పోటీగా చేయుదురు?** (యెషయా 46:5) అని సర్వసృష్టికర్తయైన యావె ఛాలెంజ్ చేయుచున్నాడు. ఆదికాలంనుండి ఎందరో భక్తిపరులైన మనుష్యులు ఎలోహీంయొక్క శక్తి వలన ఎన్నో అద్భుతకార్యాలు, సూచకక్రియలు చేశారు. అంతటి గొప్ప వ్యక్తులైన మోషే, ఏలియా, ఎలీషా, అపోస్తలులు మొదలగువారు దావీదు, సమూయేలు, వీళ్ళందరికీ మూలపితరులైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబు అనువారు తమ్మును తాము తగ్గించుకొని ఎలోహీంను హెచ్చించారు. మనం ఈ లోకంలో జీవించినంతకాలము యషువ మెస్సీయను పోలి నడచుకోవాలని అపోస్తలుడైన సౌలు సెలవిచ్చుచున్నాడు. అంతేగానీ అస్థిరులును అశాశ్వతమైన మానవులను కాదు.

సహోదరీ సహోదరులారా ! ఈ విగ్రహారాధన అనేది ఆత్మీయంగా వ్యభిచారంతో సమానం అని పరిశుద్ధ గ్రంథం సెలవిచ్చుచున్నది. ఎలోహీమయిన యావె, తన ప్రజలైన యిస్రాయేలీయులు తనను విడిచిపెట్టి విగ్రహాలను పూజించినప్పుడు వారు చేసిన కార్యాన్ని వ్యభిచారంతో పోల్చాడు. **నేను నీకిచ్చిన బంగారువియు, వెండివియునైన ఆభరణములను తీసికొని నీవు పురుషరూప విగ్రహములను చేసికొని వాటితో వ్యభిచరించితివి. మరియు నీ విచిత్ర వస్త్రములను తీసి వాటికి ధరింపజేసి, నా తైలమును నా ధూపమును వాటికర్పించితివి భోజనమునకై నేనిచ్చిన ఆహారమును గోధుమపిండిని నూనెను తీసికొని యింపైన సువాసన కలుగునట్లు నీవు ఆ బొమ్మలకు అర్పించితివి.** (యెహెజ్కేలు 16:17-19) **నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయై యున్నాడు సైన్యములకధిపతియగు "యావె" అని ఆయనకు పేరు** (యెషయా 54:5) అని యెషయా ద్వారా ఎలోహీం ప్రకటిస్తున్నాడు. మరి సృష్టికి కర్త, భర్త అయిన యావెను వదలి విగ్రహాలను పూజిస్తే అది వ్యభిచారం కాకపోతే మరి యేమిటి? లోకానుసారంగా తన భార్య వేరొక పురుషునితో వ్యభిచరిస్తుంటే ఏ భర్త అయినా చూస్తూ ఊరుకుంటాడా? అదేవిధంగా మనకు భర్త అయిన ఎలోహీం తనను వదిలి విగ్రహాలను పూజించేవారందరికి ఎలాంటి శిక్ష విధించబోతున్నాడో ఈ క్రింది లేఖనములను పరిశీలిస్తే అర్థమవుతుంది. **ఆరవ దూత బూర ఊదినప్పుడు......... ఈ మూడు దెబ్బలచేత అనగా వీటినోళ్ళలోనుండి బయలువెడుచున్న అగ్ని, ధూమ, గంధకములచేత మనుషులలో మూడవ భాగం చంపబడెను. ఈ దెబ్బలచేత చావక మిగిలిన జనులు, దయ్యములను, వినను, నడువనుశక్తి లేనివై, బంగారు వెండి, కంచు రాయి కర్రలతో చేయబడిన తమ హస్తకృతములైన విగ్రహములను పూజింప విడిచిపెట్టినట్లు మారు మనస్సు పొందలేదు** (ప్రకటన 9వ అధ్యాయము) **ఆక్రూరమృగమునకు గాని, దాని ప్రతిమకు గాని యెవడైనను నమస్కారము చేసి వాడు అగ్ని గంధకములతో బాధింపబడును. వారి బాధ సంబంధమైన పొగ యుగయుగములు లేచును.... వారు రాత్రింబగళ్ళు నెమ్మది లేనివారై యుందురు.**(ప్రకటన 14:9-11) **అంతట మొదటి దూత వెలుపలికి వచ్చి తన పాత్రను భూమిమీద కుమ్మరింపగా ఆ క్రూర మృగము యొక్క ముద్ర గలవారిని దాని ప్రతిమకు నమస్కారము చేయువారికిని బాధాకరమైన చెడ్డపుండ్లు పుట్టెను.** (ప్రకటన 16:2) పిరికివారును, అవిశ్వాసులును, నరహంతకులును, వ్యభిచారులును, **విగ్రహారాధికులును** అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు. ప్రకటన 21:8 కాబట్టిమీరు జాగ్రత్తపడి విగ్రహాలకు దూరంగా ఉండండి.

సహోదరులారా! సృష్టికర్తయైన యావె ఆకాశమునకును, భూమికిని ఎలోహీం అయినందున ఆయన హస్తకృతములైన ఆలయంలో నివసింపడు అని అపోస్తలుడైన సౌలు సెలవిచ్చుచున్నాడు. ఆయన అందరికి జీవమును, ఊపిరిని, సమస్తము దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువయున్నట్టు మనుష్యులచేతులతో సేవింపబడువాడుకాడు. ఆయన ఎవనికి దూరంగా ఉండువాడు కాడు. మనమాయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము ఉనికి కల్గియున్నాము. మనమాయన సంతానము. కాబట్టి **మనము ఎలోహీం సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పనలవలన మల్చబడిన, బంగారమునైనను వెండినైనను రాతినైనను దేవత్వం పోలియున్నదని తలంపకూడదు. ఆ అజ్ఞానకాలములను ఎలోహీం చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు.** అ॥కార్య 17:23-30 కాబట్టి ప్రతిఒక్కరు ఆయన ఆజ్ఞాపించిన విధంగా విగ్రహాలను వదిలి జీవముగల ఎలోహీం అయిన యావెను మాత్రమే ఆరాధింపవలెను. ఎవరైతే అలా ఆరాధిస్తారో వారు నిత్యజీవాన్ని స్వతంత్రించుకొంటారు. అట్లు కాక ఎవరైతే విగ్రహాలను పూజిస్తారో వారు నిత్యాగ్నిలో వేయబడి యుగయుగములు బాధపడతారు. (యెషయా 6:3) ఈ క్రింది వాక్యములు కూడా జాగ్రత్తగా పరిశీలించి చదవండి. (యెషయా 43:11,12) ( యెషయా 44:6) (యిర్మీయా 32:27) (యెషయా 46:9) (నిర్గమ 3:15) (యెషయా 42:8)

**సైన్యములకధిపతియగు యావె, పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది.**

Kindly send your subscriptions and donations to :
Bro. Isaac E. Kusuma, SBI Online A/C No. 10664134898, Bank Code 0885. Narsapur.

## ఇది మీకు తెలుసా?

ఇశ్రాయేలు బైబిలులో రక్షకుని యొక్క నామము జీసస్ అని గాని, క్రైస్ట్ అని గాని, యేసు అని గాని, క్రీస్తు అని గాని, క్రైస్తవులు అని గాని లేదు.ఇదిగో ఈ క్రింది వాక్యములను చదవండి.

**Mat 1:21:** And she shall bear BEN (Son) and you will call SHMO (his name, Zech 6:12) YEHOSHUA (Zech 6:11-12) because he will bring his people yeshuah (rescue, salvation, deliverance) from their peyshaim (rebellions)

**Acts 11:26** And, having found him, he brought him to Antioch.And it came about that for an entire year, they met with Moshiach's Kehillah there, and taught a large multitude.And it was in Antioch that the talmidim were first called **Ma'aminim Ha Meshichiyim** (*Messianic Believers*).

**Acts 26:28** And Agrippa said to Rav Sha'ul, "You think, do you, that as quick as that you can make me **mekabel Rebbe, MelechHa Moshiach?"**

**1. Kefa 4:16** But if any one of you suffers as a **ma'aminb'Moshiach** (*believer in Moshiach*), let him not be ashamed, but let him glorify Hashem by this Name.

**---- The Orthodox Jewish Bible**

Printed, Published and Owned by Isaac. E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram -533 253. E.G. Dt. and Publsihed at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved